క్లుప్తంగా

వెలుగోడు వాసికి డాక్టరేట్


రియాజ్ అహ్మద్

వెలుగోడు: పట్టణానికి చెందిన ఎస్ఎండీ రియాజ్ అహ్మద్ రాయలసీమ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేథమెటిక్స్ విభాగంలో ప్రొఫెసర్ డాక్టర్ అహ్మద్ వహీదుల్లా పర్యవేక్షణలో అప్లికేషన్ ఆఫ్ కంప్యూటేషనల్ స్టాటిస్టిక్స్ అనే అంశంపై పరిశోధ పత్రం సమర్పించగా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ ప్రదానం చేశారు. రియాజ్ అహ్మద్‌ను కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, అధ్యాపకులు అభినందించారు.

మహానందీశుడి పల్లకీ సేవ రద్దు

మహానంది: క్షేత్రంలో శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి జరగాల్సిన పల్లకీ సేవ వర్షం కారణంగా రద్దయ్యింది. సాయంత్రం నుంచి మోస్తరు వర్షం కురుస్తుండగా, రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో ఆలయ అధికారులు, పండితులు కార్యక్రమాన్ని రద్దు చేశారు. కాగా వర్షానికి భక్తులు కొంత ఇబ్బందులు పడ్డారు.

దాతల సేవలు సద్వినియోగం చేసుకోండి


ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న ఏఎస్ఐ వెంకట శేషయ్య

మిడుతూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు దాతలు అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం మిడుతూరులోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు 100 ప్లేట్లు, 100 గ్లాసులను ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం మాజీ అధ్యక్షుడు, నంద్యాల టుటౌన్ ఏఎస్ఐ వెంకట శేషయ్య అందజేశారు. అనంతరం ఏఎస్ఐ వెంకటశేషయ్యకు అంగన్‌వాడీ సిబ్బంది పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ


బండిఆత్మకూరులో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

మహానంది: బండిఆత్మకూరు మండలంలో 1–10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈఓలు యశోధ, మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ 3,650 మంది విద్యార్థులకు 31,706 పాఠ్యపుస్తకాలకు గాను 27,987, 22,610 నోట్‌పుస్తకాలు అందజేశామని చెప్పారు.

నేడు మాన్యం కౌలుకు వేలం

జూపాడుబంగ్లా: మండలంలోని తరిగోపుల గ్రామంలో శనివారం అనంతనాగేశ్వర, చెన్నకేశవ, ఆంజనేయస్వామివార్ల దేవస్థానాలకు చెందిన మాన్యం భూములకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయాల ఈఓ ఏడీ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవస్థానాలకు చెందిన సుమారు వంద ఎకరాల భూములకు ఏడాది పాటు కౌలుకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రూ.2వేలు ధారావత్తుగా చెల్లించి వేలం పాటల్లో రైతులు పాల్గొనవచ్చన్నారు.దేవస్థానానికి పాత బకాయిలున్న రైతులు వేలం పాటల్లో పాల్గొనరాదని తెలిపారు.

షాదీ తోఫా పంపిణీ


తోఫా అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేద ముస్లిం యువతికి పెళ్లి నిమిత్తం షాదీ తోఫా పంపిణీ చేశారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, రాష్ట్ర హజ్ కమిటీ మాజీ చైర్మన్ మోమిన్ అహ్మద్‌హుసేన్, ముఫ్తీనూర్ మొహమ్మద్, మోమిన్ ఇస్మాయిల్, జబీవుల్లా పెళ్లిలో భాగంగా అందజేసే వివిధ రకాల వస్తువులు అందజేశారు.

టెండర్లకు ఆహ్వానం

నంద్యాల టౌన్: నంద్యాల రీజియన్ పరిధిలోని పలు ఆర్టీసీ డిపోల్లో ఔట్ సోర్సింగ్ పనులు చేయుటకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి రజియా సుల్తానా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేశామని, ప్రస్తుతం కోడ్ ముగియడంతో అవే పనులకు టెండర్లు పిలుస్తున్నట్లు చెప్పారు. ఈనెల 20వ తేదీ వరకు టెండర్లకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు సమీపంలోని ఆర్టీసీ డిపో ఆఫీస్‌లో సంప్రదించాలని సూచించారు.

అక్రమ కట్టడాల నిలుపుదలకు నోటీసులు


నోటీసులు ఇస్తున్న పంచాయతీ అధికారి బాలూనాయక్


నోటీసులిచ్చినా నిర్మించిన మూడంతస్తుల లాడ్జి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండల కేంద్రమైన సున్నిపెంటలో అక్రమ కట్టడాలను నిలిపివేయాలంటూ గ్రామ పంచాయతీ అధికారి బాలూనాయక్ శుక్రవారం నోటీసులు జారీ చేశారు. గతంలో రెండు పర్యాయాలు నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్మాణాలు నిలిపివేయక పోవడంతో శ్రీశైలం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో 2023 ఆగస్టు 11న 24 మంది ఆక్రమణదారులపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయినా వారిలో మార్పు రాకపోగా.. బహుళ అంతస్థుల నిర్మాణానికి పూనుకున్నారు. లాడ్జీలు, హోటళ్లు, వ్యాపారసముదాయాలు, గెస్ట్‌హౌస్‌లు, ఇళ్లు తదితర కట్టడాలు కొనసాగుతున్నాయి. కొందరు నిర్మాణాలు పూర్తి చేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి కట్టడాలు నిలిపివేయాలంటూ మూడోసారి 16 మందికి నోటీసులు జారీ చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి


ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న డాక్టర్ లిండ్సే జాక్

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలోని రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని నంద్యాల జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శాతనకోట, జంగంపాడు గ్రామాలలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు సాగు చేసిన పంటలను బ్లూమ్ స్టడీ ప్రతినిధి హిడెన్‌బర్గ్ యూనివర్సిటీ డాక్టర్ లిండ్సే జాక్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రైతులతో ప్రకృతి వ్యవసాయంలో పాటిస్తున్న పద్ధతులను గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ విజయ్‌కుమార్, బ్లూమ్ స్టడీ బృందం, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం


గౌరు జనార్దన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కొత్తపల్లి: అధికారం ఉన్నా, లేకున్నా రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్థానిక నాగంపల్లి సొసైటీ మాజీ చైర్మన్ గౌరుజనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన గౌరుజనార్దన్ రెడ్డి శుక్రవారం ఎంపీపీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఆయనకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకుల సహకారంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించిన అవకాశంతో ఏడాదిపాటు రైతుల అభివృద్ధికి అంకితభావంతో కృషి చేశానని, మార్ట్‌గేజీలోన్లు ఇప్పించామని, గోడౌన్లు నిర్మించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ కుసుమలత, వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ(రంగ), వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్‌బాషా, సర్పంచులు జమిలాబీ, నిత్యలక్ష్మీదేవి, శోభలత, ఎంపీటీసీలు శివన్న, స్రవంతి, మూబీనాబేగం, బాలరాజు, రమిజాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, రవీంద్రారెడ్డి, రహంతుల్లా, రమేష్ బాబు, నంద్యాల ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని అలవర్చుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం అబ్దుల్‌సలాం

జూపాడుబంగ్లా: రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అలవర్చుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ అబ్దుల్‌సలాం తెలిపారు. గురువారం జూపాడుబంగ్లా వైకేపీ కార్యాలయంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులతోపాటు నేలస్వభావాన్ని కాపాడుకొనేందుకు రైతులు తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. అధిక రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగంతో భూసాంద్రత తగ్గి నేలచౌడుబారుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా చిరుధాన్యాలైన మొక్కజొన్న, జొన్న, సజ్జలు, రాగులు, మినుములు, కొర్రలు, ఉలవలు, అలసందలు, ఆవాలు, తదితరాల సాగుతో భూసాంద్రత లోపించదన్నారు. అనంతరం 18రకాల చిరుధాన్యాలను 10కిలోల చొప్పున కిట్లను రైతులకు అందజేశారు. అలాగే రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లోని రైతులకు రూ.13.50లక్షల రుణాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఏసీ డేగలయ్య, ఏపీఎం అంబమ్మ, ఎఫ్‌పీఓ సీసీ కర్రెన్న, క్లస్టర్‌ఇన్‌చార్జి బాలస్వామి, రైతుమిత్ర బాలస్వామి, ఎఫ్‌పీఓ కార్యదర్శి లక్ష్మయ్య, అకౌంటెంటు ఖైరూన్‌బీ, రైతులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఆత్మకూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మహేంద్రుడు శుక్రవారం తెలిపారు. ప్రయాణికులు సెల్: 9959225801 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు, ఫిర్యాదులు తెలియజేయాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

మహానంది: బండిఆత్మకూరు మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 7,8,9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సయ్యద్ అబ్దుల్ రాఫీ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎస్సీ బాలికల హాస్టల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ఎస్సీ బాలికల హాస్టల్‌లో ప్రవేశానికి ఆసక్తి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ ఉమాదేవి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ హాస్టల్‌లో ఐదోవ తరగతి నుంచి పదోతరగతి వరకు విద్యార్థినులకు వసతిసౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ బాలికలకు 70 సీట్లు ఉండగా ప్రస్తుతం70 సీట్లు పైబడి భర్తీ కాగా ఇంకా ఎవ్వరైనా ఆసక్తి ఉన్న ఎస్సీ బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఎస్టీలకు 5 సీట్లు, బీసీలకు 12, ఓబీసీలకు 9, ఇతరులకు 4 సీట్లు ఉండగా ఎస్టీ–3సీట్లు, బీసీ–5సీట్లు, ఓబీసీ–8సీట్లు, ఇతరులు–4సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్ పాత్ర కీలకం

నందికొట్కూరు: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర కీలకమని డిపో మేనేజర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. నగదు బహుమతి అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు అత్యధిక కేఎంపీఎల్ తేవడంతో ఆర్టీసీకి ఆదాయం పెరిగినట్లేనన్నారు. డ్రైవర్లు ఇస్మాయిల్‌మియ్యా, కేవీ స్వామి, ఎస్ఎం వలి కేఎంపీఎల్ సాధించారని, కండెక్టర్లు ఏడీ నాయుడు, డీ సరోజినీదేవి, శంకరయ్య ఆదర్శంగా నిలిచారని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో లష్కర్‌కు గాయాలు

పగిడ్యాల: నందికొట్కూరు -పగిడ్యాల రోడ్డు బాదనమ్మ బావి సమీపంలోని రైస్‌మిల్లు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో లష్కర్ పుల్లయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. నందికొట్కూరు సెక్షన్ పరిధిలోని కేసీ కెనాల్ 90 స్లూయిస్ లష్కర్‌గా విధులు నిర్వహించే పుల్లయ్య కార్యాలయంలో పనులు ముగించుకుని టీవీఎస్ ఎక్సెల్ 100 మోపెడ్‌పై స్వగ్రామమైన పగిడ్యాలకు బయలుదేరాడు. మార్గమధ్యంలో రైస్‌మిల్లు వద్దకు చేరుకోగానే సంకిరేణిపల్లెకు వెళ్తున్న మల్లయ్య క్రాస్ చేసే క్రమంలో బైక్ బంపర్ తగలడంతో లష్కర్ బోల్తాపడ్డాడు. అతని కాళ్లు, చేతులకు రక్తగాయాలు అయ్యాయి. పుల్లయ్యను చికిత్స నిమిత్తం నందికొట్కూరుకు తరలించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు


పార్నపల్లెలో పనులు చేయిస్తున్న సర్పంచ్


ఏ.కోడూరులో మురుగునీటి నిల్వలో మందు చల్లుతున్న సిబ్బంది

మహానంది: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండటంతో అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. మహానంది, బండిఆత్మకూరు మండలాల్లోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో పనులు ముమ్మరంగా చేస్తున్నారు. చెత్తసేకరణ బండ్ల ద్వారా గ్రీన్ అంబాసిడర్లు చెత్తను సేకరించి కాల్చివేస్తున్నారు. అలాగే శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మురుగు కాల్వలను శుభ్రం చేయించి బ్లీచింగ్, దోమలు, క్రిమి నివారణ కోసం ఎబిట్ ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్నట్లు ఏ.కోడూరు, పార్నపల్లె సర్పంచ్‌లు మన్నె జ్ఞానాభరణం, షేక్ షబ్బీర్ అహమ్మద్ తెలిపారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ అశోక్

పాములపాడు: ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ అశోక్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో ముస్లింలు, విశ్వహిందూ పరిషత్ కమిటీ సభ్యులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కులమతాలకతీతంగా సోదర భావంతో మెలగాలన్నారు. ఒకరి పండుగలను మరొకరు గౌరవించుకోవాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో మత విద్వేషాలకు లోనుకాలేదని, ముున్ముందు ఇలాగే నడుచుకోవాలని సూచించారు. ముస్లింలకు ముందస్తు బక్రీదు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో ముస్లిం మత గురువులు సుభాన్, ఆరీఫ్, పెద్దలు ఇస్మాయిల్, కాశీం, అన్వర్, మౌలాలి, నబిసా, నబిరసూల్, విశ్వహిందూ కమిటీ సభ్యులు సత్యమయ్య, ప్రదీప్, రాజగోపాల్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి


కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

నందికొట్కూరు రూరల్ : వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం రూ.600 చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, జిల్లా సహాయ కార్య దర్శి ఫక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మొక్కజొన్న నాటుతున్న కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలని కోరారు. 50సంవత్సరాలు దాటిన వారికి రూ.10వేల భృతి ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంపంగి. వెంకటేశ్వర్లు, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్పీకర్ అందజేత


పాఠశాల సిబ్బందికి స్పీకర్ బాక్స్ అందజేస్తున్న వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ

కొత్తపల్లి: మండలంలోని కొక్కెరంచ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్దార్థరెడ్డి పంపిన స్పీకర్‌ను శుక్రవారం వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ పాఠశాల సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలల అభివృద్ధి కోసం నాడు–నేడు కార్యక్రమం చేపట్టారన్నారు. ఆయన మార్గంలోనే బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఎప్పుడు విద్యార్థుల సేవలో ఉంటారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శర్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సింగారం చిన్న వెంకటస్వామి, రమణ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసు నిందితుడి అరెస్టు


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

ఆళ్లగడ్డ: దొర్నిపాడు మండలం డబ్ల్యూ కొత్తపల్లెలో ఇటీవల జరిగిన చోరీ కేసులో దొంగను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం డీఎస్పీ షర్ఫుద్దీన్ వివరాలను వెల్లడించారు. గ్రామానికి చెందిన భూమా బ్రహ్మనందరెడ్డికి డ్రైవర్‌గా వ్యవహరిస్తున్న యోగీశ్వరరెడ్డి వ్యసనాలకు బానిస కావడంతో పాటు అక్క పెళ్లికి రూ.4లక్షల వరకు అప్పులు చేశాడు. బ్రహ్మనందరెడ్డి ఇంట్లో నమ్మకంగా ఉంటూనే ఇంటి తాళాలు తీసుకొని బంగారు నగలు, రూ.50వేల నగదు చోరీ చేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అలా రెండుసార్లు దొంగతనానికి పాల్పడ్డాడు. అనుమానం రావడంతో భూమా బ్రహ్మనందరెడ్డి కుమారుడు భూమా సందీప్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. కారు డ్రైవరే నిందితుడిగా తేల్చారు. బంగారు డైమండ్ నెక్లెస్, మరో రెండు బంగారు నెక్లెస్‌లు, నాలుగు గాజులు, ఒక బంగారు డాలరు ఎత్తుకెళ్లాడు. అలాగే రూ.50వేల నగదు కూడా తస్కరించాడు. దొర్నిపాడు శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో అరెస్టు చేసి సుమారు రూ.18.20 లక్షల విలువజేసే సొమ్ము, నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. రూరల్ సీఐ హనుమంత్‌నాయక్, ఎస్ఐ సురేష్‌ను డీఎస్పీ అభినందించారు.

జవ్వాజి సుంకన్నగౌడు సేవలు మరువలేనివి


జవ్వాజి సుంకన్నగౌడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కమిషనర్, ప్రజా నాయకులు

నందికొట్కూరు: ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు 40 ఎకరాలు ధారదత్తం చేసిన దివంగత జవ్వాజీ సుంకన్నగౌడు సేవలు మరువలేనివని మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలోని జవ్వాజి సుంకన్నగౌడు వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి కమిషనర్ సుధాకర్‌రెడ్డి, మున్సిపాలిటి ఉద్యోగులు, సిబ్బంది, జవ్వాజి సుంకన్నగౌడు సేవ సమితి అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడు, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాలర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ నందికొట్కూరు పంచాయతీకి మొదటి సర్పంచ్‌గా ఎన్నికైన జవ్వాజి సుంకన్న ప్రజలకు చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బాలయ్య, రఘురామమూర్తి, నాగరాజు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

దంపతులపై కేసు నమోదు

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో గురువారం రాత్రి జరిగిన హత్యాయత్నం ఘటనపై బాధితుడు చెరకు స్వాములు ఫిర్యాదు మేరకు పాలమర్రి తిక్కస్వామి, భార్య సుజాతపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయశేఖర్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన పాలమర్రి తిక్కస్వామి కొన్నాళ్లుగా ఓ మహిళను వేధింపులకు గురిచేస్తుండగా ఇది పద్ధతి కాదంటూ చెరకు స్వాములు అడ్డుకుంటున్నాడు. దీంతో ఆగ్రహించిన పాలమర్రి తిక్కస్వామి భార్య సుజాతతో కలిసి చెరకు స్వాములపై గొడ్డలితో దాడి చేశాడు. ఈ మేరకు బాధితుడు ఆసుపత్రిలో చెరకు స్వాములు చికిత్స పొందుతున్నాడు.

చోరీ ఘటనపై కేసు నమోదు

పగిడ్యాల: మండల పరిధిలోని పడమర ప్రాతకోట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చోరీకి గురైన ఐఎఫ్‌పీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్) ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయశేఖర్ శుక్రవారం తెలిపారు. గురువారం ఉదయం తరగతి గదులను శుభ్రం చేసేందుకు పాఠశాలకు వెళ్లి చూడగా ఐఎఫ్‌పీ డిజిటల్ బోర్డు కనిపించలేదని ప్రధానోపాధ్యాయురాలు సువర్ణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న ఎస్ఐ భూపాలుడు

వెలుగోడు: పండుగలు ప్రశాంత వాతావరణంలో, శాంతియతంగా జరుపుకోవాలని ఎస్ఐ భూపాలుడు సూచించారు. బక్రీద్ నేపథ్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ..ఇటీవల జరిగిన ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలందరూ సహకరించారన్నారు. ఉరుసు కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నామన్నారు. బక్రీద్ పండుగను కూడా శాంతియూతంగా జరుపుకోవాలని కోరారు. తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు బైక్‌లు, వాహనాలు ఇవ్వవద్దని చెప్పారు. మాజీ ఎంపీపీ ఎల్లాల కృష్ణుడు, సర్పంచ్ వేల్పుల జయపాల్, జాకీర్‌హుసేన్, మోమిన్ రసూల్, సుధాకర్, అమీర్ హంజా పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

కొత్తపల్లి: వెనుకబడిన కొత్తపల్లి మండలాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సూచించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో శుక్రవారం ఎంపీపీ కిచ్చన్నగారి కుసుమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖల అధికారులు తమపరిధిలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు వివరించారు. ఎత్తిపోతల పథకాల ద్వారా రైతులు సాగుచేసుకొనే పంటలకు సాగునీటిని అందించాలని జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జవహర్‌బాబు, తహసీల్దార్ తిరుపతయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, ఈఓఆర్డీ శివరామయ్య, ఏపీఎం పుల్లయ్య, ఏపీఓ రేష్మ, ఎంఈఓలు శ్రీరాములు, ఇనాయతుల్లా, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరమ్మ, వైద్యాధికారులు మహమ్మద్‌బేగ్, జబీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నూతన చికిత్సలపై వైద్యులకు అవగాహన


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మాధవ్

నంద్యాల టౌన్: వైద్యులు నూతన వైద్య చికిత్స విధానాలపై అవగాహన కలిగి ఉండాలని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో నంద్యాల ప్రాంతంలోని వైద్యులకు నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో, హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆసుపత్రి సహకారంతో తుంటి కీలు మార్పిడి శస్త్ర చికిత్స, ఆధునిక విధానాలు, బ్లడ్ క్యాన్సర్‌లో ఆధునిక చికిత్స అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రవికృష్ణ మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల ద్వారా నూతన చికిత్సలపై అవగాహన కల్పిస్తామని, తద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. యశోద ఆసుపత్రి క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ మాధవ్ దంతాల మాట్లాడుతూ ప్రాథమిక దశలో గుర్తించిన క్యాన్సర్లకు చక్కటి సత్ఫలితాలు ఉంటాయన్నారు. క్యాన్సర్‌కు సంబంధించిన అవగాహన ప్రజల్లో పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి,నంద్యాల ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ వసుధ అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ పనిల్, డాక్టర్ ఉదయ్ కృష్ణ మైనేని, డాక్టర్ సహదేవుడు, వైద్యులు పాల్గొన్నారు.